## భార్యను వేధిస్తున్నాడన్న కోపంతో..

### తమ్ముడి గొంతుకోసి చంపిన అన్న

బంజారాహిల్స్, అక్టోబర్ 5: భార్యను వేధిస్తున్నాడన్న కోపంతో సొంత తమ్ముడిని అత్యంత కిరాతకంగా గొంతుకోసి హత్య చేసిన ఘటన ఫిలింనగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఫిలింనగర్‌లోని బసవ తారకనగర్ బస్తీలో నివాసముంటున్న షబ్బీర్ అహ్మద్, సజ్జీ అహ్మద్ (39) సోదరులు. వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వారితో పాటే అనారోగ్యంతో బాధపడుతున్న తండ్రి కూడా ఉంటున్నాడు. రెండునెలల కిందట షబ్బీర్ అహ్మద్ భార్య పుట్టింటికి వెళ్లి.. తిరిగి రాలేదు. విషయం తెలుసుకోగా.. మరిది సజ్జీఅహ్మద్ తనను తీవ్రంగా లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడని, కాపురానికి రాలేనని భర్తకు ఫిర్యాదు చేసింది. దీంతో అనారోగ్యంతో ఉన్న తండ్రిని చూసుకునేందుకు ఇంట్లో ఆడమనిషి లేకపోవడంతో షబ్బీర్ అహ్మద్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. భార్య కూడా పుట్టింటికి వెళ్లిపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. తన తమ్ముడి లైంగిక వేధింపుల వల్లే భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని నిర్ధారణకు వచ్చిన షబ్బీర్ అహ్మద్.. తమ్ముడిని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి వరకు తమ్ముడి చేత మద్యం తాగించిన షబ్బీర్ అహ్మద్.. అతడు నిద్రపోయాడని నిర్ధారించుకున్న తర్వాత కూరగాయలు కోసే కత్తితో షజ్జీ అహ్మద్ గొంతు కోశాడు. అంతటితో ఆగకుండా మెడవైపు కూడా కోయడంతో తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం తెల్లవారుజామున రెండున్నర సమయంలో తమ్ముడిని చంపేశానంటూ డయల్ 100కు షబ్బీర్ అహ్మద్ ఫోన్‌చేసి చెప్పాడు. దీంతో అప్రమత్తమైన జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్, ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణతో పాటు సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. క్లూస్ టీమ్ సాయంతో ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించిన పోలీసులు.. షబ్బీర్ అహ్మద్‌ను అదుపులోకి తీసుకున్నారు.

## వాహనదారుకు ఇన్సూరెన్స్ చెల్లించాల్సిందే

సిటీబ్యూరో, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): వాహనదారుకు జీరో డిప్ ఇన్సూరెన్స్ చెల్లించాల్సిందేనని హైదరాబాద్ వినియోగదారుల కమిషన్ పేర్కొన్నది. ఇన్సూరెన్స్ చెల్లింపులో నిర్లక్ష్యం వహిస్తూ.. నిరాకరించినందుకు రూ.20 వేలు నష్టపరిహారంగా అందజేయాలని సూచించింది. సికింద్రాబాద్ అడ్డగుట్టకు చెందిన మహ్మద్ బాక్రీ అలీ తన కారుకు సోంపో ఇంటర్నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి వాహన బీమాను తీసుకున్నాడు. అయితే, ఓ ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసమయ్యింది. దీంతో ఇన్సూరెన్స్ కంపెనీకి సమాచారం అందించగా.. సర్వేయర్ వచ్చి నష్టపోయిన కారు ఇన్సూరెన్స్ చెల్లింపును అంచనావేసి బీమా సంస్థకు అందజేశాడు. కాగా, మరమ్మతు కోసం వాహనాన్ని షెడ్డుకు తరలించగా బీమా క్లెయిమ్ ఆలస్యం కావడంతో వాహన మరమ్మతును వాయిదావేస్తూ వచ్చారు. దీంతో వినియోగదారుడు సోంపో ఇంటర్నేషనల్ బీమా కంపెనీపై హైదరాబాద్ వినియోగదారుల కమిషన్‌లో కేసు వేశాడు. కమిషన్ అధ్యక్షురాలు బి.ఉమావెంకటసుబ్బలక్ష్మి, సభ్యులు సి.ప్రసన్నలక్ష్మీలతో కూడిన బెంచ్ కేసును విచారించింది. బాధితుడికి రూ.5 లక్షలు చెల్లించాల్సిందేనని సదరు ఇన్సూరెన్స్ కంపెనీని ఆదేశించింది. చెల్లింపులో నిర్లక్ష్యం వహించినందుకు రూ.20వేలు నష్టపరిహారంగా అందజేయాలని సూచించింది.

## వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా సేవలు

సిటీబ్యూరో, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : సరుకు రవాణా రంగాలలో వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా నిరంతరం భారతీయ రైల్వే సేవలందిస్తున్నదని ఎస్‌సీఆర్ జీఎం అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో 75వ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ (జడ్‌ఆర్‌యూసీసీ) సమావేశం గురువారం సికింద్రాబాద్‌లోని రైల్వే ఆఫీసర్స్ క్లబ్‌లో ముగిసింది. ఈ సమావేశంలో ఎస్‌సీఆర్ జీఎంతోపాటు రాష్ట్ర ప్రభుత్వాలచే నామినేట్ చేయబడిన సభ్యులు, 31 మంది జడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు, ఆరు డివిజన్లకు చెందిన డివిజనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సభ్యులు, కన్జూమర్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్, ప్రిన్సిపల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ అసోసియేషన్స్, రిజర్వ్‌డ్ ప్యాసింజర్స్ అసోసియేషన్ సభ్యులతో పాటు రైల్వే మంత్రి చేత నామినేట్ అయిన సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## యాచకుల మధ్య ఘర్షణ.. ఒకరి హత్య

ఖైరతాబాద్, అక్టోబర్ 5: యాచకుల మధ్య జరిగిన ఘర్షణ ఒకరి హత్యకు దారి తీసింది. ఈ ఘటన పంజాగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై హరీశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పంజాగుట్ట మసీదు వెనుక వైపు శివరాజ్, అతడి కొడుకు అనిల్, కోడలు జ్యోతి నివాసముంటున్నారు. కొన్నేళ్లుగా అక్కడే ఉంటూ యాచక వృత్తి చేస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఓ వ్యక్తివచ్చి.. అనిల్, మరోవ్యక్తి మధ్య పంజాగుట్ట మసీదు ప్రాంతంలో గొడవ జరుగుతున్నదంటూ శివరాజ్‌తో చెప్పాడు. హుటాహుటిన కోడలను తీసుకొని అక్కడికి వెళ్లి చూడగా, అనిల్ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. స్థానికుల సాయంతో వెంటనే 108 వాహనాన్ని రప్పించగా, అందులో ఉన్న సిబ్బంది పరీక్షించి అనిల్ మృతి చెందినట్లు నిర్ధారించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ దవాఖానకు తరలించారు. శ్రీను అనే యచకుడిపై అనుమానం ఉన్నదని, అతడే కొట్టి చంపాడని పేర్కొంటూ తండ్రి శివరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ప్రజల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కృషి

- హోం మంత్రి మహమూద్ అలీ
- మేడిపల్లిలో రూ.78 కోట్లతో నిర్మిస్తున్న కమిషనరేట్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రులు మహమూద్ అలీ, మల్లారెడ్డి



మేడిపల్లిలో నూతన పోలీసు కమిషనరేట్ భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మంత్రులు మహమూద్ అలీ, మల్లారెడ్డి తదితరులు

పీర్జాదిగూడ, అక్టోబర్ 5: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక శాంతి భద్రతల విషయంలోఎన్నో సందేహాలు ఉండేవనీ, సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలతో ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం ప్రశాంతంగా ఉన్నదని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. రాష్ట్రంలో నేరాల నియంత్రణతో పాటు శాంతి భద్రతలు బలపడ్డాయన్నారు. మేడిపల్లిలో రూ.78 కోట్లతో సుమారు 60 ఎకరాల స్థలంలో నూతనంగా చేపడుతున్న అధునాతన రాచకొండ పోలీసు కమిషనరేట్ కార్యాలయ నిర్మాణానికి ఆయన మంత్రి మల్లారెడ్డితో కలిసి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా పోలీసులతో ప్రజలకు మంచి అనుబంధం ఏర్పడిందన్నారు. ప్రజల రక్షణ, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అహర్నిషలు పాటుపడుతున్నదని తెలిపారు. మేడిపల్లిలో నిర్మించే రాచకొండ కమిషనరేట్ దేశంలోనే అతిపెద్ద విస్తీర్ణం గల కార్యాలయం అవుతుందన్నారు. తెలంగాణలో శాంతిభద్రతల వ్యవస్థను బలోపేతం చేశామన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటులో దేశంలోనే ప్రథమ స్థానంలో ఉన్నామన్నారు. మహిళలకు పోలీసు శాఖలో 33 శాతం రిజర్వేషన్ కల్పించామన్నారు. మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. రాచకొండ పోలీసు కమిషనరేట్ నూతన భవన నిర్మాణాన్ని మేడ్చల్ నియోజకవర్గం మేడిపల్లిలో చేపట్టడం ఆనందంగా ఉన్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణ కోసం ప్రత్యేక పోలీస్ విభాగాలు, ప్రత్యేక పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేయడంతో మహిళలు హర్షిస్తున్నారని పేర్కొన్నారు. శాంతి భద్రతల విషయంలో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉన్నదని తెలిపారు. రాచకొండ పోలీసు కమిషనర్ డీఎస్ చౌహాన్ మాట్లాడుతూ.. మేడిపల్లిలోని సువిశాల ప్రాంతంలో నూతన కమిషనరేట్ భవన నిర్మాణం చేపట్టడం ఎంతో సంతోషంగా ఉన్నదన్నారు. మహిళల పట్ల జరిగే నేరాలు, హింసను తగ్గించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దయానంద్, డీసీపీ (ట్రాఫిక్) అభిషేక్ మహంతి, మల్కాజిగిరి జోన్ డీసీపీ జానకీ, సైబర్ క్రైమ్ డీసీపీ అనురాధ, ఎస్‌ఓటీ డీసీపీ గిరిధర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ దర్గ దయాకర్‌రెడ్డి, బోడుప్పల్, జవహర్‌నగర్ మేయర్లు సామల బుచ్చిరెడ్డి, కావ్య, పీర్జాదిగూడ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, పోచారం చైర్మన్ కొండల్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్లాస్‌రూమ్‌లోకి వెళ్లి..

ధైర్యంగా షీ టీమ్స్‌ను ఆశ్రయించిన విద్యార్థిని

# ప్రేమించాలంటూ బెదిరింపులు

- మహిళలను వేధిస్తే కఠిన చర్యలు
- నిర్భయంగా షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేయండి
- రాచకొండ మహిళా సేఫ్టీ డీసీపీ ఉషా విశ్వనాథ్




సిటీబ్యూరో, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): కాలేజీలో క్లాస్ నడుస్తున్నది. విద్యార్థులు పాఠాలు వింటున్నారు. ఓ యువకుడు ఏకంగా క్లాస్ రూమ్‌లోకి చొరబడ్డాడు. విద్యార్థులంతా చూస్తుండగానే నేరుగా ఓ విద్యార్థిని వద్దకు వెళ్లాడు. నన్ను ప్రేమిస్తావా..? లేదా..? అంటూ ఆ యువతిని బెదిరిస్తూ హీరోయిజాన్ని ప్రదర్శించాడు. ధైర్యంగా నిలబడిన ఆ యువతి.. ఫిర్యాదు చేయడంతో షీ టీమ్స్ యువకుడిని పట్టుకొని కటకటాల్లోకి పంపించాయి. ఇలాంటి ఘటనలు ఇటీవల అక్కడక్కడ జరుగుతున్నాయి. షీ టీమ్స్‌కు ఫిర్యాదులు అందుతున్నాయి. వెంటనే స్పందిస్తున్న షీ టీమ్స్ రంగంలోకి దిగి నిందితులను పట్టుకుంటున్నాయి. బాధితులకు భరోసా ఇస్తున్నాయి. రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో గడిచిన 15 రోజుల వ్యవధిలో 83 మంది ఆకతాయిలను పట్టుకున్నట్లు మహిళా సేఫ్టీ డీసీపీ ఉషా విశ్వనాథ్ గురువారం మీడియాకు తెలిపారు. పట్టుబడ్డ ఆకతాయిలకు కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. మహిళలను వేధించే వారి పట్ల కఠినంగా ఉంటామని, వదిలిపెట్టే ప్రసక్తే లేదని తెలిపారు. నిర్భయంగా మహిళలు షీ టీమ్స్‌ను ఆశ్రయించాలని సూచించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, విద్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో మఫ్టీలో షీ టీమ్స్ తిరుగుతూ.. డేకాయి ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయని వివరించారు. మహిళలను వెంబడిస్తూ, వేధించే వారిని సాక్ష్యాధారాలతో సహ పట్టుకొని న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నామని తెలిపారు. వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ కూడా ఇస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన కొన్ని ఘటనలను డీసీపీ వివరించారు.

### బాత్రూమ్ ఫొటోలు తీస్తూ..

మేడిపల్లి ఏరియాలో నివాసముండే ఒక మహిళ బాత్రూంలో ఉండగా.. అదే అపార్టుమెంట్‌కు గతంలో వాచ్‌మన్‌గా పనిచేసిన ఓ వ్యక్తి బయట నుంచి వీడియోలు తీశాడు. వీడియోలు తీస్తున్న విషయాన్ని గుర్తించిన బాధితురాలు వెంటనే అప్రమత్తమైంది. స్థానికుల సహాయంతో అతడిని పట్టుకొని షీ టీమ్స్‌కు అప్పగించింది. పట్టుబడ్డ వ్యక్తి గతంలో అదే అపార్టుమెంట్‌కు వాచ్‌మన్‌గా పనిచేసినట్టు బాధితులు పోలీసులకు తెలిపింది. దీంతో నిందితుడిపై మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

### నడి రోడ్డుపై.. బాలికపై దాడి

నేరేడ్‌మెట్‌లో ఇంటర్ చదువుతున్న ఓ బాలిక రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నది. ఇంతలో నేను ఇన్‌స్టాగ్రామ్‌లో మెసేజ్ పెడితే రిప్లై ఇవ్వవా..? అంటూ బాధితురాలిని రోడ్డుపై పట్టుకొని కొట్టాడు. అదే సమయంలో అక్కడ డెకాయి ఆపరేషన్ నిర్వహిస్తున్న కుషాయిగూడ షీ టీమ్స్ వీడియో తీసి, బాధితురాలి తల్లికి చూపించారు. దీంతో ఆమె తన కూతురిపై జరిగిన దాడిపై నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేశారు.

### ప్రేమించాలంటూ క్లాస్ రూమ్‌లోకి వెళ్లి..

చౌటుప్పల్ ప్రభుత్వ కాలేజీలో ఇంటర్ చదువుతున్న ఒక విద్యార్థిని క్లాస్ రూమ్‌లో ఉండగా.. నిందితుడు క్లాస్ రూమ్‌లోకి దూసుకుపోయాడు. తనను ప్రేమించమంటూ వెంటపడుతున్నా పట్టించుకోవడం లేదని, తనను ప్రేమించకపోతే నీ అంతు చూస్తానంటూ.. బెదిరింపులకు దిగాడు. ఆకతాయి బెదిరింపులపై ఆ విద్యార్థిని చౌటుప్పల్ షీ టీమ్స్‌ను ఆశ్రయించింది. దీంతో షీ టీమ్స్ నిందితుడిని అరెస్ట్ చేసి, చౌటుప్పల్ పోలీసులకు అప్పగించారు.

## గణేశ్ పండుగ వేడుకల్లో.. ఆకతాయిల అలజడి

- షీ టీమ్స్‌కు చిక్కిన 488 మంది పోకిరీలు
- మొదటి దఫాలో 122 మందికి జైలు శిక్ష

సిటీబ్యూరో, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): గణేశ్ నవరాత్రులు, నిమజ్జనోత్సవంలో షీ టీమ్స్ నిఘాకు 488 మంది పోకిరీలు చిక్కారని, అందులో 122 మందికి జైలు శిక్షలు ఖరారు చేస్తూ న్యాయస్థానం తీర్పు చెప్పిందని హైదరాబాద్ మహిళా సేఫ్టీ డీసీపీ కవిత తెలిపారు. గతనెల 18 నుంచి 28వ తేదీ వరకు జరిగిన గణేశ్ వేడుకలలో బడా గణేశ్, ఎన్టీఆర్ మార్గ్, ట్యాంక్‌బండ్, , ఖైరతాబాద్ ప్రాంతాల్లో షీ బృందాలు నిఘా ఏర్పాటు చేయగా.. మహిళలతో చాలా మంది అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వీడియోలకు దొరికిపోయారని తెలిపారు. క్యూ లైన్‌లో ఉన్నవారితో, వేడుకలు వీక్షించేందుకు వచ్చే వారిని రద్దీలో తాకుతూ, ఇష్టానుసారంగా కామెంట్లు చేస్తున్న వారిని (488 మంది) పట్టుకోగా.. అందులో 122 మందిపై పెట్టీ కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు. వారికి 3 రోజుల నుంచి ఆరు రోజుల వరకు శిక్షలు విధిస్తూ న్యాయస్థానం తీర్పు చెప్పిందని వివరించారు. 111 కేసులలో వార్నింగ్ ఇచ్చి కౌన్సెలింగ్ నిర్వహించామని, ఇంకా 255 కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయన్నారు.